క్లుప్తంగా

ప్రేమ సమాజం పిల్లలకు దుప్పట్ల పంపిణీ



పిల్లలకు దుప్పట్లు, తువ్వాళ్లు అందజేస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: చలికాలం దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని ప్రేమ సమాజంలో 70 మంది పిల్లలకు స్థానిక జవహర్ క్లబ్ సభ్యులు దుప్పట్లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. సమాజం అధ్యక్షుడు పూసర్ల రామారావు, మేనేజర్ సిహెచ్.ప్రసాదరాజు సమక్షంలో జవహర్ క్లబ్ అధ్యక్షుడు మంథా గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి పసుమర్తి హరిబాబు, ఉపాధ్యక్షుడు పోతల ప్రకాష్ పిల్లలకు శనివారం అందజేశారు. జవహర్ క్లబ్ వితరణ పట్ల ప్రేమ సమాజం నిర్వాహకులు, పిల్లలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మల్లంపాలెంలో విఘ్నేశ్వరస్వామి తీర్థం

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పందేలు



స్వయంభూ విఘ్నేశ్వర స్వామి

కె.కోటపాడు: మల్లంపాలెంలో భోగి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వయంభూ విఘ్నేశ్వర స్వామి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు, షటిల్ టోర్నమెంట్, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఎడ్ల పందేల్లో రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన బళ్లకు బహుమతులు ప్రదానం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

దివ్యాంగులకు నిత్యావసర సరకులు పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: మానవసేవే మాధవ సేవ అని నమ్మిన వ్యాపారి వినాయక రామకృష్ణ సంక్రాంతి పండగను పురస్కరించుకుని దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో హెచ్.వి.జయరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ అనాథలకు భోజనం అందజేయటమే కాకుండా దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందించటం అభినందనీయమన్నారు. మనకు ఉన్నంతలో ఎదుటివారికి సహాయపడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, తహసీల్దార్ అన్నాజీరావు, వ్యాపారి వెలగా నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా బాలయేసు పండగ



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

రావికమతం: కొత్తకోట బాలయేసు దేవాలయం పండగ శనివారం ఘనంగా జరిగింది. స్థానిక ఫాదర్ అజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ, జ్ఞానాపురం, అనకాపల్లి, మాడుగుల, చోడవరం, పెదబొడ్డేపల్లి, అడ్డురోడ్‌కు చెందిన చర్చిల ఫాదర్లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

నేడు కె.జె.పురంలో గోదాదేవి కల్యాణం



కల్యాణ వేంకటేశ్వర స్వామి

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారంతో ముగిస్తున్నాయి. ఈ సందర్భంగా సాయంత్రం ఇక్కడ కళావేదిక మీద గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త రాపేట రామకొండలరావు శనివారం తెలిపారు.



రావికమతంలో హరిదాసుకు బియ్యం పోస్తున్న చిన్నారులు



కొత్తకోటలో గంగిరెద్దుల వాడికి పప్పుబియ్యం, దుస్తులు అందించి ఆశీర్వాదం పొందుతున్న మహిళలు



కొత్తకోటలో మంగయ్యమ్మ తీర్థానికి ఏర్పాటవుతున్న రంగులరాట్నం

గ్రామాల్లో పండగ కళ

- మొదలైన గంగిరెద్దుల వాళ్ల సందడి
- గ్రామగ్రామాన ముగ్గుల పోటీలు
- భోగి తీర్థానికి సిద్ధమైన వినోద కార్యక్రమాలు

గ్రామాల్లో పండగ కళ సంతరించుకుంది. పట్టణాల నుంచి చేరుకుంటున్న వలస జీవులతో పల్లెల్లో సందడి నెలకొంది. ఏ వీధి చూసినా.. ఇప్పుడు ఏ ఇంటికెళ్లినా సరదా ముచ్చట్లే కనిపిస్తున్నాయి. మరోవైపు చిన్నారులు, యువకులు ఆటపాటలతో మునిగి తేలుతున్నారు. ముఖ్యంగా భోగి తీర్థాలకు పలు గ్రామాలు ముస్తాబవుతున్నాయి.

రావికమతం: సంక్రాంతి పండుగ గ్రామాల్లో కన్పిస్తోంది. ఇందుకు శుభసూచకంగా గంగిరెద్దుల వాళ్లు 'డూడూ బసవన్న.. రారా బసవన్నా..''అమ్మవారికి దండంబెట్టూ.. అయ్యగారికి దండం బెట్టు'అంటూ సందడి చేస్తున్నారు. సన్నాయి ఊదుతూ.. నెమలి పించెతో ఆశీర్వదిస్తున్నారు. మరోపక్క హరినామ కీర్తనలు పాడుతూ హరిదాసులు సందడి చేస్తుండగా.. మహిళలు, చిన్నారులకు వారికి బియ్యం వేస్తూ ఆశీస్సులు పొందుతున్నారు. భోగి పండగ మొదలు 16 రోజుల వరకూ రావికమతం, కొత్తకోట, మేడివాడ, గుమ్మాళ్లపాడు తదితర గ్రామాల్లో జరిగే గ్రామ తీర్థాలకు పిల్లలకు సరదా నిమిత్తం ఇప్పటి నుంచే రంగుల రాట్నాలు సిద్ధం చేస్తున్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

నాతవరం: సంక్రాంతి పండగ సందర్భంగా ఏ గ్రామంలో చూసినా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నాతవరం ఎస్సీ కాలనీలో శనివారం నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంచి నైపుణ్యం కనబరిచిన మహిళలకు స్థానిక రాజకీయ నాయకులు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. అదే విధంగా మండల వ్యాప్తంగా భోగి, సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.



మాడుగుల రూరల్: కింతలిలో దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

చీడికాడ: మండలంలో ఆదివారం తెల్లవారు జామున భోగి మంటలు వేసేందుకు సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం నుంచి పిడకలు, తాటికమ్మలు, ఇటీవల తుఫాన్‌లో నేలకొరిగిన చెట్ల మొద్దులతో యువకులు సిద్ధం చేశారు.

మాడుగుల రూరల్: సంక్రాంతి పండగ దృష్ట్యా గ్రామాల్లో కోలాహలం నెలకొంది. పిండి వంటల తయారీకి సామగ్రి కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. పితృదేవతలకు పూజించేందుకు కొత్త బట్టలు కొనుగోలు చేస్తున్నారు. కొత్త కుండలను వారపు సంతల్లో కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల మాడుగుల, వీరనారాయణం, కింతలి వారపు సంతల్లో వీటిని కొనుగోలు చేసుకుని సిద్ధం చేశారు. మైదాన, గిరిజన గ్రామాల ప్రజలు సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.



నాతవరం: జిల్లేడుపూడిలో ముగ్గుల పోటీలు



మాడుగుల రూరల్: మాడుగులలో కొత్త కుండలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



చీడికాడ: అర్జునగిరిలో భోగిమంటకు తాటికమ్మలను సిద్ధం చేస్తున్న చిన్నారులు

'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' గోడపత్రికల విడుదల



సంక్షేమ పథకాలకు సంబంధించిన గోడపత్రికల విడుదల చేస్తున్న అధికారులు

కె.కోటపాడు: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం అందిస్తున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. శనివారం ఎ.భీమవరం, ఎ.కోడూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల ద్వారా సాగు పెట్టుబడి కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజల చెంతకే ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం ద్వారా వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు తర్రా సన్యాసమ్మ, అక్కునాయుడు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం.. ఆంధ్రా



రోలుగుంటలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

రోలుగుంట: ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలు శనివారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం క్రికెటు పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ఎనిమిది జట్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చూపాయి. ఈవోపీఆర్డీ ఎస్.నూకరాజు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ ఈ పోటీలను పర్యవేక్షించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



చెక్కులు అందజేసిన బాధిత కుటుంబాలతో ఎమ్మెల్యే గణేష్



చెక్కును అందజేస్తున్న హరిబాబు, తదితరులు

నర్సీపట్నం: బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకున్న నర్సీపట్నం మండలం గురంధరపాలెంకు చెందిన పక్కుర్తి బెన్నిబాబుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.20 లక్షలు, కరోనాతో మృతి చెందిన పెదబొడ్డేపల్లికు చెందిన మెకానిక్ పెదిరెడ్ల వెంకట నర్సింగరావు కుటుంబానికి రూ.3 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే శనివారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నాయకులు మామిడి శ్రీను, సచివాలయాల మండల కన్వీనర్ శానపతి వెంకటరత్నం, పార్టీ నాయకులు శ్రీనువాసరావు పాల్గొన్నారు.

పాడిరైతు కుటుంబానికి..

–మాకవరపాలెం: తామరం గ్రామానికి చెందిన కోసూరు రాజుబాబు భార్య సత్యవతికి రూ.15 వేల బీమా చెక్కును నాయకులు అందజేశారు. పాల ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యుడిగా ఉన్న ఆయన మృతితో విశాఖ డెయిరీ నుంచి సుఖీభవ పథకంలో భాగంగా ఈ మొత్తం మంజూరైంది. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, పాల సంఘం అధ్యక్షుడు గ్రెడ్డి అప్పారావు, కార్యదర్శి కె.వెంకటరమణ పాల్గొన్నారు.

పాల సొసైటీ సభ్యులకు బోనస్

మాడుగుల రూరల్: కె.జె.పురం పాల సొసైటీ సభ్యులకు బోనస్ పంపిణీ చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో పాలు సరఫరా చేసిన 467 మంది సభ్యులకు 7 లక్షల 12 వేల 687 రూపాయలు సొసైటీ అధ్యక్షుడు యల్లపు వెంకట శ్రీనివాసరావు శనివారం అందజేశారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెలాఖరు వరకు పాలు సరఫరా చేసిన పాడి రైతులకు ఈ బోనస్ పంపిణీ చేశారు. సొసైటీ వేతన కార్యదర్శి బొడ్డేడ ప్రసాదు, సంఘ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుదాణాలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

ఏడీ చిట్టినాయుడు తనిఖీలు



ఎల్. పొన్నవోలులో పశుదాణా విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: పశుదాణా విక్రయ కేంద్రాల్లో దాణాలో నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు హెచ్చరించారు. మండలంలో ఎల్. పొన్నవోలు, మాడుగుల గ్రోమోర్ పశుదాణా విక్రయ కేంద్రాల్లో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పశుదాణా బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించారు. పశుదాణాలో పోషకవిలువలు ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి విశాఖ ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. పశుదాణాలో నాణ్యత లోపించి కల్తీ ఉందని తేలితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో ప్రతి రోజూ పండగే..

'గడపగడపకు' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి



దేవరాపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అవినీతికి, సిఫార్సులకు ఆస్కారం లేకుండా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ రోజు పండగలా ప్రజలంతా ఆనందంగా జీవిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాల్గో రోజు శనివారం దేవరాపల్లి పంచాయతీ బంగారమ్మపాలెం, సంతతోట, ముత్యాలమ్మపాలెం, అల్లిపురం, కొల్లివారి కల్లాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి మహిళలను, వృద్ధులను, చిన్నారులను ఆత్మీయంగా పలకరించి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు తన దృష్టికి తీసుకు వచ్చిన పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. ప్రతీ ఇంటికి నవరత్నాలు అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలంనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, వాలేటి నాగరాజు, వేచలపు వాణి, సోమిరెడ్డి సత్యవతి, గుల్లేపల్లి మురళీ, కొల్లి ఈశ్వరరావు, బంధం అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు పలు భవనాల ప్రారంభోత్సవం

హాజరు కానున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సూదివలసలో గ్రామ సచివాలయం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన రైతు భరోసా కేంద్రం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

కె.కోటపాడు: మండలంలో గొట్లాం, సూదివలస గ్రామాల్లో రూ.2.22 కోట్లతో పూర్తి చేసిన ప్రభుత్వ భవనాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించనునానరు. గొట్లాంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డుతోపాటు సూదివలసలో రూ.2.2 కోట్లతో పూర్తయిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌తోపాటు జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటి కుళాయిలను ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రథంపై గోదారంగనాథుల ఊరేగింపు



అర్జునగిరిలో భజనా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



కొవ్వూరులో గోదారంగనాథులను రథంపై ఊరేగిస్తున్న భక్తులు

చీడికాడ/రోలుగుంట: ధనుర్మాసం సందర్భంగా రోలుగుంటలో సిద్ధి వినాయక, జీవకారుణ్య సంఘం భక్త భజన బృందాల ఆధ్వర్యంలో గోదారంగ నాథాచార్యుల చిత్రపటాలను రథంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకుని ధన, ధాన్య రూపంలో కానుకలు సమర్పిస్తున్నారు. ధనుర్మాసం ముగిసిన తరువాత భారీ అన్న సమారాధన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో మేలికొలుపు కార్యక్రమం నిర్వహించారు.

కోడిపందేలు, జూదాలపై కఠిన చర్యలు

చోడవరం, కొత్తకోట సీఐలు హెచ్చరిక



చోడవరం సీఐ శ్రీనివాసరావు



కొత్తకోట సీఐ అప్పలనాయుడు

చోడవరం రూరల్/రావికమతం: సంక్రాంతి పండగ రోజులతోపాటు గ్రామ తీర్థాల్లో కోడిపందేలు, జూదం ఆడడం చట్టరీత్యా నేరమని, ప్రజలు వాటి జోలికి పోవద్దని చోడవరం, కొత్తకోట సీఐలు బి.శ్రీనివాసరావు, ఎల్.అప్పలనాయుడు శనివారం వేర్వేరు ప్రకటనల్లో హెచ్చరించారు. పండగ సరదా పేరుతో కోడి పందేలు, జూదం, గుండాట వంటివి నిర్వహించినట్టయితే వీటి నిర్వహకులపైనా ఉత్సవ నిర్వాహక కమిటీపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్ చేసే ఆకతాయిలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బుచ్చెయ్యపేట/రోలుగుంట: సంక్రాంతి పండగను ప్రజలంతా తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని ఎస్‌ఐలు డి. ఈశ్వరరావు, ఎస్సై ఎల్. సురేష్ కోరారు. పండగలు, తీర్థ మహోత్సవాలు సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. సంక్రాంతి పండగలకు ఇంటికి తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్లే వారు చోరీలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ముందస్తు సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

రోలుగుంట : మండలంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి స్థానిక ఎస్ఐ ఎల్.సురేష్ దాడులు చేశారు. ఈ దాడుల్లో దిబ్బల పాలెం పొలాల్లో నిర్వహిస్తున్న కోడి పందాలపై దాడి చేసి 13 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి అయిదు కోడి పుంజులు, రూ. 3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించిట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థుల ఉన్నతి

అనకాపల్లి: విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. ఎంపీ కార్యాలయంలో శనివారం ప్రైమరీ స్కూల్స్ హెచ్ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోవెల రవి, ప్రధాన కార్యదర్శి నేమాల రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లా బాబ్జీ పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

పారిశుధ్య కార్మికులకు విశ్రాంత డీపీఎంవో వితరణ

మునగపాక : ఏటా గ్రామంలోని పారిశుధ్యం మెరుగుపరుస్తున్న పారిశుధ్య కార్మికులకు తనవంతు సాయంగా విశ్రాంత డీపీఎంవో ఆడారి సన్యాసిరావు దుస్తులు అందజేశారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినం సందర్భంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తుంటారు. ఈ ఏడాది కూడా శనివారం మునగపాక పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు తనవంతు సాయంగా వస్త్రాలు అందజేసి ఔదార్యం చాటుకున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన 104 సిబ్బంది



జగదీష్‌ను పరామర్శించిన 104 డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు

నర్సీపట్నం: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని 104 వైద్య సిబ్బంది రక్షించారు. వైద్య సిబ్బంది అందించిన వివరాలు ప్రకారం.... కొత్త లక్ష్మీపురంలో కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఎస్.జగదీష్ (25) తన ఇంట్లో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు లబోదిబోమనడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులుబద్దలు కొట్టి అతడిని బయటకు తీసుకువచ్చారు. 104 శిబిరంలో ఉన్న డాక్టర్ అనుషా, సిబ్బంది అత్యవసర వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో జగదీష్ చికిత్స పొందుతున్నాడు. 104 డివిజన్ ఇన్‌చార్జి కె.అప్పారావు ఆస్పత్రికి వెళ్లి జగదీష్ ఆరోగ్యంపై ఆరా తీశారు.